



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నోడల్ అధికారి కృష్ణనాయక్



- జిల్లాలో దగ్గు, జలుబు, గొంతు నొప్పులు
- కొన్నిచోట్ల డెంగి, డయేరియా, మలేరియా కేసులు
- మూడు నెలల్లో 81 డెంగీ, 15 మలేరియా కేసులు
- ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు రోగుల తాకిడి
- ఆస్పత్రుల్లో పెరుగుతున్న ఓపీ
- అప్రమత్తమవుతున్న వైద్యారోగ్యశాఖ

విజృంభిస్తున్న విష జ్వరాలు

కామారెడ్డి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వాతావరణం మార్పులతో జిల్లాలో సీజనల్ వ్యాధుల తాకిడి పెరగడంతో గ్రామాలు, పట్టణాల్లో అనేక మంది దగ్గు, జలుబు, గొంతు నొప్పులు, జ్వరంతో ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. పాలు తాగే శిశువుల నుంచి స్కూళ్లకు వెళ్లే బాల బాలికలు ఈ సీజన్లో జ్వరాలతో బాధపడుతున్నారు. ఇక ప్రైవేటు, ప్రభుత్వ వసతి గృహాల్లోనూ విద్యార్థులు జ్వర లక్షణాలతో ఆసుపత్రులకు వెళ్తున్నారు. వర్షాలు కురిసి తెరిపి నివ్వడంతో దోమలు, కీటకాలు, వైరస్ వ్యాప్తితో తీవ్రత పెరుగుతున్నట్లుగా వైద్యులు చెబుతున్నారు. చిన్న పిల్లలు అధికంగా జ్వరాల బారిన పడుతుండగా ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. గత 15 రోజులుగా ఈ సంఖ్య అధికంగా ఉంటుంది. ఈ మూడు నెలల కాలంలో 81 డెంగి, 15 మలేరియా కేసులు నమోదు అయ్యాయని వైద్యారోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. కామారెడి జీజీహెచ్ ఆసుపత్రితో పాటు ఆయా మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులకు తాకిడి పెరుగుతోంది.

వందలాదిగా ఓపీ

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ పరిధిలో 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 7 కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లు, 250కి పైగా సబ్ సెంటర్లు, ఒక జిల్లా ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాల అనుబంధ ఆసుపత్రులు ఉన్నాయి. వీటి పరిధిలో విష జ్వరాలతో ప్రతీరోజు వందల సంఖ్యలో ఓపీ నమోదవుతోంది. దీంతో ప్రభు త్వ ఆసుపత్రుల్లో రోగుల తాకిడి పెరుగుతోంది. దీంతో ఆసుపత్రుల్లో అదనపు బెడ్లను సమకూర్చుతున్నారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ముందస్తుగానే జ్వరం, గొంతు నొప్పి, దగ్గు, జలుబు, రోగ నిరోధక శక్తి పెరిగే మందులను స్టాక్‌ను అందుబాటులో ఉంచుతున్నారు.

ప్రైవేట్‌లో బిల్లుల మోత

జిల్లా కేంద్రంలో ప్రైవేట్ ఆసుపత్రులు, పట్టణాల్లో స్థానిక ఆర్ఎంపీల (మిగతా 8వ పేజీలో)

వ్యాధుల నివారణకు కృషి చేస్తున్నాం

• చంద్రశేఖర్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, కామారెడ్డి



ప్రతీ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా దోమకాటుకు సంబంధించిన వ్యాధులు డెంగీ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధులు సంక్రమిస్తాయి. దోమల వ్యాప్తిని వారించేందుకు ప్రతీ పీఎస్సీ పరిధిలో సిబ్బందితో డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఎక్కడైనా ప్రజలు ఎక్కువ మొత్తంలో సీజనల్ వ్యాధుల బారిన పడితే వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి తగిన చికిత్సలు అందేలా చూస్తున్నాం. ఇటీవల తాడ్వాయి మండలంలో కొందరు డయేరియా బారిన పడగా వారికి మెరుగైన చికిత్స అందేలా చూస్తాం. అన్ని పీహెచ్‌సీల పరిధిలో సిబ్బందిని అలర్ట్‌గా ఉండాలని ఆదేశించాం.. సరిపడ మందులు ఉండేలా చూసుకుంటున్నాం. ఎక్కడైనా మందుల కొరత ఉంటే దానికి సంబంధించిన అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం.

సీజనల్ వ్యాధులపై

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జీజీహెచ్‌లో పెరుగుతున్న జ్వరాల ఓపీ
- జీజీహెచ్‌లోని ఆయా విభాగాల హెచ్‌వోడీలు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇటీవల జీజీహెచ్(గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి)కి జ్వరాల బాధితులు ఎక్కువగా వస్తున్నారని ఆయా విభాగాల హెచ్‌వోడీలు పేర్కొన్నారు. శుక్రవారం జీజీహెచ్‌లో సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణ నోడల్ అధికారి కృష్ణనాయక్ మాట్లాడుతూ కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి డెంగీ కేసులు అధికంగా వస్తున్నాయని దీనంతటికి కారణం పరిసరాల పరిశుభ్రత లేకపోవడం, నీటి నిల్వలు ఎక్కువగా ఉండడమేనని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గతంలో డెంగీ భారినపడి ఈ సంవత్సరం పడితే ప్రాణాలకు అపాయమన్నారు. డెంగీకు దేశంలో ఇంకా వ్యాక్సిన్ అనేది రాలేదని అప్రమత్తతే ప్రజలకు శ్రీరామరక్ష అని అన్నారు. డెంగీ వచ్చిన 5 రోజుల నుంచి 10 రోజుల వరకు ప్లేట్‌లెట్స్ తగ్గుతూ వస్తాయని ముందుగానే చికిత్స తీసుకోవాలని సూచించారు. జూలైలో 81, ఆగస్టులో 54 డెంగీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇక జ్వరాలకు సంబంధించి జూన్‌లో 167, జూలైలో 311, ఆగస్టులో 269 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ఎంవో యాదగిరి, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ శివప్రసాద్, రామ్‌సింగ్, సంతోష్, భరద్వాజ్, నర్సింగ్ సూపరింటెండెంట్ స్వరూపరాణి, నర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వైద్యురాలిపై ఆర్డీవో ఆగ్రహం



లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీవో

లింగంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆర్డీవో పార్థసింహారెడ్డి తనిఖీ చేశారు. వైద్యురాలు రాంబాయి అందుబాటులో లేకపోవడంతో ఆమెకు ఫోన్ చేయగా పర్మల్ల తండాకు ఫీల్డ్‌పై వెళ్లినట్లు చెప్పడంతో అక్కడి పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అక్కడకు ఎవరు రాలేదని చెప్పడంతో ఆమె తప్పుడు సమచారం ఇవ్వడంతో ఆగ్రహంతో ఆమెపై శాఖాపరమైన చర్య లు తీసుకోవాలని డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఆసుపత్రిలో రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలను గురించి అడిగి తెలుసుకు న్నారు. మందుల నిల్వల రికార్డులను ఆయన పరిశీలించారు.




మాచారెడ్డిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

బీఆర్ఎస్ పాలనలో ఇబ్బందులకు గురైన ప్రజలు

• ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ

మాచారెడ్డి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో తెలంగాణ ప్రజలు మనోవేదనకు గురయ్యారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గత 10 సంవత్సరాల కాలంలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వని పేదలకు ఇళ్లు కట్టివ్వలేదన్నారు. ప్రజలు సమస్యలు చెప్పుకుందామంటే బీఆర్ఎస్ నాయకులు గ్రామాల్లోకి వచ్చేవారు కాదని బెదిరింపులకు గురయ్యేవారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పేద ప్రజల కోసం ప్రజల పక్షాన పోరాటం చేస్తూ అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. ఇందిరమ్మ కలలను సాకారం చేస్తూ ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు అందిస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని రూ.500లకే గ్యాస్ అందించడంతో పాటుగా రేషన్ షాపుల్లో సన్నబియ్యం అందిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సింగ్‌రావు, మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, సుతారి రమేష్, ఇంద్రసేనారెడ్డి, బ్రహ్మానందారెడ్డి, గణేష్‌నాయక్, పూల్‌చంద్, తదితరులు పాల్గొన్నారు.



అన్నారంలో రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి


నాగమడుగు లిఫ్ట్ కోసం భూ సేకరణ

• సబ్ కలెక్టర్ కిరణ్మయి

పిట్లం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నాగమడుగు లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి రైతుల వద్ద భూసేకరణ సర్వే, వివరాలు సేకరించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నారం, నాగంపల్లి గ్రామ శివారుల్లో రైతులతో మాట్లాడి భూసేకరణ వివరాలు, సర్వే నెంబర్లు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాగమడుగు భూసేకరణలో ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందన్నారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకరావాలని, రైతులకు సూచించారు. నాగమడుగు లిఫ్ట్ భూసేకరణలో అన్నారం శివారులో 3 ఎకరాల 25 గుంటలు, నాగంపల్లి శివారులో 3 ఎకరాల 28 గుంటల భూమి రైతుల వద్ద నుంచి తీసుకొని, నివేదికలను జిల్లా అధికారులకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్‌గౌడ్, ఆర్ఐ శీతల్, సిబ్బంది పాల్గొన్నారు.

కనెక్షన్ కట్.. సిగ్నల్ డౌన్!

- జిల్లాలో కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ శాఖ
- ప్రమాదకరంగా వేలాడుతుండడంతో తొలగింపునకు చర్యలు
- ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన విద్యుత్ అధికారులు
- దీంతో నిలిచిపోతున్న టీవీ ప్రసారాలు, ఇంటర్నెట్ సేవలు



కామారెడ్డిలో కేబుళ్లను తొలగిస్తున్న దృశ్యం

కామారెడ్డి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలపై అనధికారికంగా కేబుల్‌వైర్లు ఏర్పాటు చేయడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. గాలి, వాన సంభవించే సమయంలో కేబుల్ వైర్లు విద్యుత్ వైర్లతో కలిసి తెగిపోతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఘటనల్లో పలు ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలు పోతున్నాయి. అదేవిధంగా వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాలను తరలించే సమయంలో కేబుల్ వైర్లతో ఇబ్బందులు తలెత్తటం, కేబుల్ వైర్లు ప్రమాదకరంగా మారాయి. వీటిని వెంటనే తొలగించాలని ప్రభుత్వం విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లాలో సంబంధిత శాఖ అధికారులు కేబుల్ వైర్ల తొలగింపు చర్యలు చేపడుతున్నారు. కేబుల్ వైర్లు తొలగించడంతో జిల్లాలో ఆయా ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో పాటు టీవీ ప్రసారాలు బంద్ అయ్యాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన విద్యుత్ శాఖ

విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుల్ వైర్ల కనెక్షన్లు ప్రజల భద్రతకు తీవ్రమైన సవాలుగా మారింది. ఈ కేబుల్ వైర్లు ప్రమాదాలకు ఉరితాళ్లుగా మారుతున్నాయని పలువురి నుంచి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విద్యుత్ స్తంభాలకు అనాధికారికంగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీలతో పాటు ఆయా మండల కేంద్రాల్లో, గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా వేలాడుతున్న కేబుల్ కనెక్షన్లను, వైర్లను అధికారులు తొలగిస్తున్నారు. కేబుల్ వైర్ల తొలగింపుపై ఆయా కంపెనీలకు విద్యుత్ శాఖ అధికారులు నోటీసులు ఇవ్వడంతో పాటు సమాచారాన్ని అందిస్తున్నారు.

విద్యుత్ శాఖ వర్సెస్ కేబుల్ ఆపరేటర్లు

ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలకు అనధికారికంగా ఏర్పాటు చేసిన కేబుల్ వైర్లను తొలగిస్తుండడంతో విద్యుత్ అధికారులకు కేబుల్ ఆపరేటర్ల మధ్య వివాదం నెలకొంటోంది. ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కేబుల్ కనెక్షన్ వైర్లను తొలగించడంతో టీవీ ప్రసారాలు (మిగతా 8వ పేజీలో)

యూరియా కోసం విండో వద్ద రైతుల బారులు



బీబీపేటలో చెప్పులను వరుసలో పెట్టిన రైతులు

దోమకొండ (బీబీపేట), ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సింగిల్ విండో వద్ద శుక్రవారం యూరియా కోసం రైతులు పెద్దఎత్తున బారులు తీరారు. యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు ఉదయం నుంచి సొసైటీ వద్ద లైన్‌లో మొదటగా చెప్పులను పెట్టారు. విండో తెరవగానే రైతులు పెద్ద ఎత్తున క్యూ కట్టారు. పోలీసుల బందోబస్తు మధ్య యూరియాను ఒక్కో రైతుకు ఆధార్‌కార్డు ప్రకారం ఒక బస్తాను బీబీపేట మండల వ్యవసాయాధికారి నరేందర్ అందజేశారు. బీబీపేట విండోకు 400ల బస్తాలు, దోమకొండ విండోకు 400ల బస్తాల యూరియా వచ్చింది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాల మేరకు దోమకొండలో మండల వ్యవసాయాధికారి మణిదీపిక విండో సిబ్బందితో కలిసి ఒక్కో రైతుకు ఆధార్ కార్డు ప్రకారం రెండు బస్తాల యూరియాను పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అర్చన ఎంపిక



పెద్ద కొడప్‌గల్, ఆగష్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్లం ఉన్నత పాఠశాలకు చెందిన అర్చన జావెలిన్ త్రో విభాగంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల పీడీ ధర్మేందర్ తెలిపారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ అసోషియేషన్ పోటీల్లో ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయిందని తెలిపారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 29 నుంచి 31 వరకు జరిగే పోటీల్లో అర్చన పాల్గొంటుందని తెలిపారు. అర్చనను పాఠశాల సిబ్బందితో పాటు, గ్రామస్థులు అభినందించారు.

ఉపాధిహామీ పనుల జాతరను సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



తిమ్మాజీవాడిలో పశువుల పాకను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

సదాశివనగర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉపాధి హామీ పనుల జాతర పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని సంపద సృష్టించుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ తెలిపారు. ఉపాధి హామీ పనుల జాతరలో భాగంగా మండలంలోని తిమ్మాజీవాడిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను శుక్రవారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 400 పశువుల పాకలు, 21 గొర్రెల పాకలు, 13 నాడెపు కంపోస్టు నిర్మాణాలు, 19 కమ్యూనిటీ కాంప్లెక్స్‌లు, 34 అపోల్ల ప్లాంట్ల నిర్మాణం, 27 పౌల్ట్రీ ఫారాలు, 57 గ్రామ పంచాయతీ భవనాలు, 179 ఎకరాల్లో ఉద్యానవనాల సాగు, 1979 వ్యక్తిగత ఇంకుడు గుంతలు, తదితర పనులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మాణాలు చేపట్టామన్నారు. రైతులు బోరు బావుల వద్ద భూగర్భ జలాల అభివృద్ధికి రీచార్జ్ ఇంకుడు గుంతలను తప్పక ఏర్పాటు చేసుకోవాలన్నారు. సదాశివనగర్ మండలానికి పద్మాజీవాడిలో కమ్యూనిటీ కాంప్లెక్స్ రూ.3లక్షలతో, ఏడు గ్రామ పంచాయతీ భవనాలు ఒక్కో భవన నిర్మాణానికి రూ.20లక్షలు, రెండు అంగన్‌వాడీ భవనాలు రూ.12 లక్షల చొప్పున మండలంలో నిర్మాణాలు చేపట్టడానికి మంజూరు చేశామన్నారు. తిమ్మాజివాడిలో స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందజేస్తూ పశువుల పాకలు వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం రుణాలు అందజేయడం వల్ల ఆర్థిక తోడ్పాటు అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి రుణాలను సద్వినియోగం చేసుకుని తిరిగి చెల్లింపులు సక్రమంగా చేసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల జాతరలో భాగంగా గ్రామంలో ఉత్తమ విధులు నిర్వహించిన పంచాయతీ కార్మికులకు సన్మానం చేశారు. తిమ్మాజివాడిలో చాకలి ఎంకవ్వ ఏర్పాటు చేసుకున్న పశువుల షెడ్డును ప్రారంభించి పశువుల షెడ్డుకు సంబంధించిన పేమెంట్‌ను చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సతీష్‌యాదవ్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి సురేందర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఏపీవో శ్రీనివాస్, ఏపీఎం ప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ సంగ్యా నాయక్, పంచాయతీరాజ్ శాఖ అధికారి బాల్‌లింగం, డైరెక్టర్ అశోక్‌రావు, మాజీ సర్పంచ్ పొన్న స్వప్న, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

త్వరగా సీఎంఆర్‌ను డెలివరీ చేయాలి

కామారెడ్డి టౌన్: మిల్లర్లు సీఎంఆర్ డెలివరీని త్వరితగతిన పూర్తి చేయాలని, బ్యాంక్ గ్యారెంటీలు సమర్పించాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో రైస్‌మిల్లర్ల, పౌర సరఫరాల అధికారులతో సీఎంఆర్ డెలివరీపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లు సీఎంఆర్ డెలివరీ త్వరితగతిన (మిగతా 8వ పేజీలో)

ఏషియన్ స్విమ్మింగ్ చాంపియన్

షిప్ పోటీలకు రిత్విక



నవీపేట, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 28 నుంచి అక్టోబరు 1 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్ వీర సావర్కర్ స్పోర్ట్ కాంప్లెక్స్‌లో జరిగే ఏషియన్ స్విమ్మింగ్ చాంపియన్ షిప్-2025 పోటీలకు మండలంలోని బినోలకు చెందిన మిట్టపల్లి రిత్విక ఎంపికైంది. మిట్టపల్లి రిత్విక ఏషియన్ దేశాల స్విమ్మింగ్ పోటీలలో పాల్గొనడానికి ఇండియా తరఫున ఆమె ఈ పోటీల్లో పాల్గొనడానికి మిట్టపల్లి రిత్విక ఎంపికైనట్లు స్విమ్మింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రెటరీ మోనాల్ చౌక్ షి ప్రకటించారు. ఏషియన్ దేశాలతో పోటీ పడడానికి మన దేశం తరఫున పాల్గొంటున్న మిట్టపల్లి రిత్వికను పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రాష్ట్ర స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి ఉమేష్, ఉపాధ్యక్షులు మహిపాల్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు గడిల శ్రీరాములు అభినందించారు.

రాయితీ యంత్ర పరికరాల కోసం

దరఖాస్తు చేసుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రైతులకు కావాల్సిన యంత్ర పరికరాలు సబ్సిడీలో అందుబాటులో ఉన్నాయని కావాల్సిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని శుక్రవారం ఏఈవో రాజాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రికరణ పథకం ఉప ప్రణాళికలో భాగంగా రైతులకు యంత్ర పరికరాలను అందిస్తుందన్నారు. కావాల్సిన వారు ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బ్యాటరీ, తైవాన్ పంపులు, రోటవేటర్, సీడ్ కం ఫర్టిలైజర్, పవర్ విడర్, ఆఫ్ కేజీవీల్, బండ్ ఫార్మర్, పవర్ టిల్లర్, బ్రష్ కట్టర్, స్ట్రాబెల్లర్ తదితర పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావాల్సిన వారు దరఖాస్తు ఫారం పూర్తి పట్టదారుపాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

11వ రాష్ట్రస్థాయి జూనియర్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): 11వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లకు విద్యార్థులు ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ తెలిపారు. ఈ పోటీల్లో దాదాపు 680 పాల్గొనగా ఓంకార్, సిద్ధు, సంజీవ్, శ్రీవల్లిక, ముత్యపుతేజ, రంజిత్, ఆకాష్, చరణ్, యోగి, సాంకేత్, ఆనంద్, దినేష్, అర్చన, దరియాసింగ్, పరమేష్, వెంకటేష్, శివకుమార్, అఖిల, నందిని, మాధవి, అనిత, నవ్యశ్రీ, అనిల్‌కుమార్, ఈశ్వర్‌ప్రసాద్, అఖిల, వైష్ణవి, అమృత, కౌశిక్, ఈశ్వర్, సిరిలు ఎంపికయ్యారు. వీరు ఈనెల 30,31 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా పాలమూర్ యూనివర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

కేజీబీవీ, పూలే పాఠశాలల తనిఖీ



కేజీబీవీలో వండి వంటను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

మోర్తాడ్,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే, కేజీబీవీ పాఠశాలలను అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలల్లో తరగతి గదులను, వంట శాలలను, పరిసరాలను పరిశీలించారు. కేజీబీవీలో వండిన వంటలను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడారు. జ్యోతిబా పాఠశాలలో మెను ప్రకారం బోజనాలు అందించే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సౌకర్యం, టాయిలెట్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పాఠశాల గదులను తిరుగుతూ పరిశీలించారు. ఆయన వెంట మండల విద్యాధికారి సమ్మిరెడ్డి, జ్యోతిభాపూలే ప్రిన్సిపాల్ ప్రసాద్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్వప్న, ఎంపీడీవో తిరుమల, తహసీల్దార్ కృష్ణాలు ఉన్నారు.

ఘనంగా రాజా బహదూర్ వెంకట్‌రామిరెడ్డి జయంతి



రాజా బహదూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

రెంజల్/జక్రాన్‌పల్లి ,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంజల్, బోర్గాం, తాడ్‌బిలోలి గ్రామాలలో తెలంగాణ వైతాళికుడు, సంఘ సంస్కర్త, విద్యా ప్రదాత రాజా బహదూర్ వెంకట్‌రామిరెడ్డి 156వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిజాం పాలనలో పేద విద్యార్థులకు విద్యను అందించాలన్న సంకల్పంతో హైదరాబాద్ చుట్టు పక్కల విద్యార్థుల కోసం వసతి గృహాలు, గ్రంథాలయాలను ఏర్పాటు చేసిన గొప్ప దార్శనికుడు రాజా బహదూర్ వెంకట్‌రామిరెడ్డి అని ఆయన సేవలను సదా స్మరిస్తూ వారి అడుగు జాడల్లో నడవాలని సూచించారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవ చేయాలని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చేయూతనిచ్చి అందరికి విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో విద్యాలయాలను నెలకొల్పిన విద్య ప్రదాత రాజా బహదూర్ వెంకట్‌రామిరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లిలో శుక్రవారం రాజ బహదూర్ వెంకట్‌రాంరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజా బహదూర్ వెంకట్‌రాం రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాటిపల్లి నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

పేకాట రాయుళ్ల అరెస్టు

నవీపేట,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు. పేకాట ఆడుతున్న వారి వద్ద నుండి 8,830 రూపాయల నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్‌లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎక్కడైన పేకాట ఆడినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

పేకాట కేంద్రంపై పోలీసుల దాడి

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి తండా పరిధిలో పేకాట కేంద్రంపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భం గా ఎస్సై అరుణ్‌కుమార్ మాట్లాడుతు తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు కాటేపల్లి తండా దాడి చేయగా పేకాటఆడుతున్న 7 గురిని గుర్తించి వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. దీంతో పాటుగానే 6 మొబైల్స్, 2450 రూపాయల నగదు సీజ్ చేశామని తెలిపారు.

పత్రాలు లేని మోటారు సైకిల్ పట్టివేత

పెద్దకొడప్‌గల్,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): పెద్దకొడప్‌గల్ మండలంలో పత్రాలులేని మోటార్ సైకిల్‌ను పట్టుకుని హైదరాబాద్ సీసీఎస్ పోలీ సులకు అప్పగించినట్లు ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. 2022 సంవత్సరంలో హైదరాబాద్‌కు చెందిన ఓవ్యక్తి మోటార్ సైకిల్ చోరీ అయింది. అది చేతలు మారి మండలోని ఒక వ్యక్తి వద్దకు చేరింది.మోటార్ సైకిల్ గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

జంగంపల్లిలో యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగంపల్లి గ్రామంలో జీవితంపై విరక్తి చెంది ఒక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందినట్లు భిక్కనూరు ఎస్సై ఆంజనేయులు శుక్రవారం తెలిపారు.ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సైదుగారి శ్రావణ్(36) గత కొంతకాలంగా మద్యానికి బానిసై సక్రమంగా పనిచేయడం లేదు. భార్య ఎన్నిసార్లు చెప్పిన వినేవాడు కాదని జీవితంపై విరక్తి చెందిన చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య ప్రత్యూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు.

టీయూ పరిధిలోని ఎంఎడ్ పరీక్షల తేదీ ప్రకటన

డిచ్‌పల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎంఎడ్ 1, 2, 3వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలు మరియు 4వ సెమిస్టర్ రెగ్యూలర్,బ్యాక్‌లాగ్‌థియరీ పరీక్షలు ఆగస్టు 28 నుంచి నిర్వ హించనున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారి చార్య కె.సంపత్‌కుమార్ తెలిపారు.

● ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం పరీక్ష ఫీజు నోటిఫికేషన్ విడుదల

విశ్వవిద్యాలయం పరిధిలోని ఎల్‌ఎల్‌బీ, ఎల్‌ఎల్‌ఎం 4వ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు సెప్టెంబర్ నెలలో నిర్వహించబడుతుందని పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కె.సంపత్‌కుమార్ తెలిపారు. 28వ తేదీ వరకు అపరాద రుసుము లేకుండా చెల్లించవచ్చని, రూ.100 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 1 వరకు చెల్లించే అవకాశం ఉందని ఆయనే పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

అమ్మకాలకు ఆది దేవుళ్లు



విక్రయించడానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

నందిపేట,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలో అమ్మకానికి గణేష్ విగ్రహాలను సిద్ధం చేశారు. ఇంట్లో ఏ శుభ కార్యం చేసిన మొదటగా పూజలు అందుకునేది ఆది దేవుడే. ఆ దేవుడు ఉత్సవాలు ఆగష్టు 2న వినాయక చవితి పేరుతో నిర్వహించనున్నారు.అందు కోసం గణేషులను విక్రయించడానికి వ్యాపారులు కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల నుంచి తీసు కువచ్చారు. నంది పేట మండల కేంద్రంలోని పలుచోట్ల విక్రయానికి పెట్టారు. ఒక్కో క్కటి రూ.2వేల నుంచి 8వేల వరకు ధర పలుకుతోంది.ధరతగ్గట్టుగా అడ్వాన్స్ చెల్లిస్తు న్నారు. వందల సంఖ్యలో నందిపేటలకు వినాయకులు చేరుకున్నాయి. అయితే మండపాల నిర్వాహకులు, విద్యార్థులు, యువకులు విరాళాల సేకరణలో పడ్డారు.



భూమిపూజ చేస్తున్న దృశ్యం



తొర్తిలో ..



రాంపూర్‌లో ..

ఘనంగా పనుల జాతర

బోధన్/రుద్రూరు/మాక్లూర్/ఏర్గట్ల/రెంజల్/ముప్కాల్/కమ్మర్‌పల్లి/మోస్రా/జక్రాన్‌పల్లి /కోటగిరి ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): బోధన్, సాలూర మండలాల్లో మన ప్రజా ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలాల్లోని పలు గ్రామాలలో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం చేయడం జరిగిందని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని రాంపూర్, సాలూర మండలంలోని మందర్నా, సాలంపాడ్ తదితర గ్రామాలలో అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం మన ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్, సాలూర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, మందర్నా రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు గణపతి రెడ్డి, కల్దుర్కి సోసైటీ చైర్మన్ శరత్, ఎంపీవో మధుకర్, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, ఉపాధ్యక్షులు వసంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ బాలకృష్ణ, సాలూర ఎంపీడీవో శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ రాథోడ్ రాధిక, సాలంపాడ్ సోసైటీ చైర్మన్ బ్రహ్మరెడ్డిలతో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. రుద్రూరులో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రుద్రూరు మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు కింద 12లక్షల రూపాయలతో నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భీంరావు, పంచాయతీ సెక్రెటరీ ప్రేమ్‌దాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట అరుణ్ కుమార్, నాయకులు పత్తిరాము, తోట సంగయ్య, పత్తి లక్ష్మణ్, షేక్ ఖాదర్, కర్క అశోక్, షేక్ నిస్సార్, ఇందూర్ కార్తీక్, అంగన్‌వాడీ టీచర్‌లుతదితరులుపాల్గొన్నారు.మాక్లూర్‌లోప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమాన్ని శుక్రవారం ఎంపీడీవో బ్రహ్మానందం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు, ప్రతినిధులు, పాల్గొన్నారు.

ఏర్గట్లలో గ్రామీణాభివృద్ధి, ప్రజలకు ఉపాధి కల్పన, పల్లెల్లో మౌళిక సదుపాయాల విస్తరణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పనుల జాతర కార్యాక్రమాన్ని చేపడుతుందని మండలంలోని అధికారులు, కాంగ్రెస్ నాయకులు అన్నారు. శుక్రవారం మండలంలోని తొర్తి గ్రామంలో అధికారులు ఏఈ భట్టాచార్య, ఎంపీవో శివచరణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సోమదేవ రెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆడెం గంగాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్‌లు పనులు ప్రారంబించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ రవి, గడ్డం జీవన్, యత్ ప్రెసిడెంట్ దానం గంగమోహన్, కౌడ పెద్ద భూమేశ్వర్, బెజ్జారం భాను, తదితరులు పాల్గొన్నారు. బాల్కొండ, ముప్కాల్ మండలాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముత్యంరెడ్డి, వేల్పూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ జైడి రవి, బద్దం సాగర్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. రెంజల్‌లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలోని కందకుర్తి, అంబేద్కర్ నగర్ గ్రామాలకు నూతనంగా మంజూరైన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శుక్రవారం మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో కమలాకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్‌తో కలిసి భూమిపూజ చేశారు.కందకుర్తి, అంబేద్కర్ నగర్‌లో నూతనంగా అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ వినయ్ కుమార్, ఎంపీవో రఫీక్, నాయకులు ధనుంజయ్, జావీద్, గయాస్, అంజయ్య, మోహన్, యూత్ కాంగ్రెస్ బోధన్ అసెంబ్లీ అధ్యక్షులు కార్తీక్ యాదవ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గైని కిరణ్, సోషల్ మీడియా కన్వీనర్ అబ్బోల్ల శ్రీకాంత్, మహిళ విభాగం అధ్యక్షురాలు ఇందిరా రెడ్డి, శివ, బోగిడి రవి, పంచాయతీ కార్యదర్శి సునీల్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు. కమ్మర్‌పల్లి ప్రతీఇందిరమ్మ ఇంటిలో ఇంకుడుగుంత తప్పనిసరిగా నిర్మించుకోవాలని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపునర్సయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని నాగా పూర్, కమ్మర్‌ఎల్లి గ్రామాలలో పనుల జాతర కార్యక్ర మాన్నిఎంపీడీవో రాజా శ్రీనివాస్ మండలస్థాయి అధికా రులతో కలిసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఏపీవో విద్యానంద్, కాంగ్రెస్ పార్టీ మం డలా కాంగ్రెస్ అధ్యక్షుడు సుంకెట రవి, ప్రారంభించారు. నాయకులు బుచ్చిమల్ల య్య, సింగిరెడ్డి శేఖర్, నిమ్మ రాజేంద్రప్రసాద్, దూలూరు కిషన్, నల్లగణేష్ గుప్త, పాలెపు రాజేశ్వర్, అశోక్, ఇందిరమ్మకమిటి సభ్యులు, పంచాయితీ కార్యద ర్శులు గంగజమున, సంధ్య, లబ్దిదారులు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లిలో శుక్రవారం ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర పనుల కార్యక్రమాన్ని అధికారు లు, ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. జక్రాన్‌పల్లి, మునిపల్లి, వివేక్‌నగర్ తాండ, మనోహరబాద్, తొర్లికొండ గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడి భవ నాలు, పశుల షెడ్లు, ఇతర అభివృద్ధి పనులను చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మోస్రాలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పనుల జాతర కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని సీడీపీవో పద్మజ చేతుల మీదుగా ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఇన్‌చార్జి ఏపీవో అంబర్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి భూమేష్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుమలత, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, కరుణ, మీనా, పుష్పలత, మాజీ సర్పంచ్ భూమయ్య, యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. కోటగిరి రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో ప్రభుత్వ పనుల జాతరకు శ్రీకారం చుట్టిందని కాంగ్రెస్ నాయకులు కొట్టం మనోహర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బర్ల మధు, ఉపాధి హామీ ఏపీవో గంగారాం, పంచాయతీ రాజ్ ఏఈ నవదీష్ గౌడ్ తదితరులున్నారు.

గణేష్ మండపాల వద్ద సమస్యలను పరిష్కరించాలి

● మున్సిపల్ కమిషనర్‌కు బీజేపీ నాయకుల వినతి

బోధన్,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో గణేష్ మండపాల వద్ద నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బోధన్ మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం బీజేపీ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి రాజుల దేవి పవన్ కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు ఏనుగంటి గౌతం గౌడ్, ఉపాధ్యక్షులు దేవకట్టి శివరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు గొడుగు ధర్మపురి, ఏశాల సురేందర్, పెరిక వెంకటేష్, గుంత గంగాధర్, అడ్లూరి ఫణి, కృష్ణ, నిమ్మశ్రీనివాస్, అనిల్,విజయ్‌లతో పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణంలో ఎత్తు తగ్గించాలి

నవీపేట,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలో 161బీబీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పక్కన నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులలో ఎత్తును తగ్గించాలని పలువురు గ్రామస్థులు శుక్రవారం ఎంపీఈవో నాగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, మోహన్, సాయిలు,తదితరులున్నారు.

వర్ని తహసీల్దార్‌కు సన్మానం

వర్ని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వర్ని తహసీల్దార్ సాయిలును శుక్రవారం కూనిపూర్ గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ రాజిరెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, పెద్దకాపు లక్ష్మారెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షులు గిరిగంగారాం, కాంతయ్యవెంకట్‌గౌడ్, సాయిలు, ప్యాట్లసాయిలు, కుర్మ లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి, హన్మండ్లు, దత్తు, సాయిలు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

పెర్కిట్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని సిద్దార్థ డిగ్రి కాలేజీలో శుక్రవారం సీపీఎం ఆర్మూర్ డివిజన్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని రైతులు యూరియా కొరకు రాత్రింబవళ్లు నిలబడి ఉన్న ఎకరానికి బస్తా యూరియా దొరకడం లేదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివి జన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, జిల్లా కార్యదర్శి రమేష్ బాబు, జిల్లా కమిటీ సభ్యులు కొండ గంగాధర్, ఆర్మూర్ డివిజన్ కమిటి సభ్యులు ఎల్లయ్య, బొర్ర నాగరాజు, కుల్దీప్‌శర్మ, ఓంకార్, అశోక్, సాయిలు, రవి, పాల్గొన్నారు.

ఏర్గట్లలో శ్రీ బాల రాజ రాజేశ్వర ఆలయానికి భూమిపూజ

ఏర్గట్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో శ్రీ బాల రాజ రాజేశ్వర నూతన ఆలయానికి శుక్రవారం భూమిపూజ చేసి పనుల ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాదాయ శాఖ నుంచి రూ.40లక్షలు మంజూరీ కాగా కాగా చిన్న రేండ్ల, పెద్ద రేండ్ల సంఘం 10 లక్షలు కాంట్రిబ్యూషన్ కట్టగా మొత్తం 50 లక్షలతో ఆలయ నిర్మాణానికి భూమి పూజలు చేశామని, నిధుల మంజూరీకి కృషి చేసిన బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్‌కు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్‌కు ముదిరాజ్ సంఘాల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రేండ్ల చిన్నయ్య, ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బంది గురి చేస్తే పాఠశాల యజమానులపై చర్యలు

ఆర్మూర్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజుల రూపంలో, టీసీలు ఇచ్చే విషయంలో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత పాఠశాల యాజమ న్యాలపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో రాజగంగారాం హెచ్చరించారు. ఆర్మూర్ పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలకు శుక్రవారం శ్రీముఖం జారీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు జారీ చేసే టీసీలకు డబ్బులు వసూలు చేస్తున్నారని తమకు ఫిర్యాదు వచ్చిం దన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే పాఠశాలల యాజమన్యాలపై చర్యలు తీసుకుంటామన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

కోటగిరి/వేల్పూర్,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ పంట సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కోటగిరి మండల వ్యవసాయ అధికారి రాజు పేర్కొన్నారు. కోటగిరి మండలంలోని అడ్కాస్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఆయిల్ పామ్ పంట సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ పామ్‌పంట మిగత పంటలతో పోల్చుకుంటే ఆదాయం ఎక్కువ, ఖర్చు తక్కువగా ఉంటుందన్నారు. చీడ, పీడలు, పురుగుల బెడద ఉండదన్నారు. ఆయిల్ పామ్ పంటకు ఎరువులు తక్కువ మోతాదులో వాడుకోవచ్చని దీని వల్ల రైతులకు ఉపయోగమే కాకుండా పంట మార్పిడి చేయడం వల్ల నేల సారవంతం కూడా పెరుగుతుందన్నారు. ఈ పంటలో నాలుగు సంవత్సరాల వరకు అంతర్ పంటలు వేసుకుని రైతులు అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హర్టికల్చర్ అధికారి వహీద్ జుమ్మా, ఏఈవో సతీష్, పంచాయతీ కార్యదర్శి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. వేల్పూర్‌లో ఆయిల్ పామ్‌పంట సాగుతో అధిక లాబాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారిణి శృతి అన్నారు. శుక్రవారం వేల్పూర్ మండలం ల క్కోర గ్రామంలో ఆయిల్ ఫాం పంట సాగు పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిం చారు. ఈ సందర్భంగా శృతి మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట సాగు ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడి వివ రాలను, పంట సాగు చేయడం వల్ల కలిగే లా భాల గురించి రైతులకు క్షుప్తంగా వివరిం చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారిణి తిరుమల, జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్, రైతులు, పాల్గొన్నారు.

నర్సింగ్, టైలరింగ్ కోర్సులలో శిక్షణ కు దరఖాస్తు చేసుకోవాలి

ఆర్మూర్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో పెర్కిట్ లోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం) లో వివిధ కోర్సులలో శిక్షణకు మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ప్రాంగణం అధికారిణి ఇందిరా తెలిపారు. టైలరింగ్, బ్యూటీషియన్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్ (నర్సింగ్) కోర్సులలో శిక్షణ పొందడానికి మహిళలు, ఒంటరి మహిళలు రెస్క్యూ హోంలోని మహిళా అభ్యర్థినిలు, ఆర్థికంగా వెనుకబడిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. టైలరింగ్, బ్యూటిషియన్ కోర్సులో శిక్షణకు 8వ తరగతి అర్హత కలిగిన వారు, కమ్యూనిటి హెల్త్ వర్కర్ శిక్షణకు 10వ తరగతి చదివిన మహిళలు తమ పదవ తరగతి మెమో, ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, 3 ఫోటోలతో ఈనెల 31వ తేదీలోగా మహిళ ప్రాంగణంలో ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7660022520, 8332949550 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎంపీ నిధులు మంజూరు

ముప్కాల్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రంలోని మేరు సంఘం కమిటి హాల్‌కు నిజామాబాద్ జిల్లా ఎంపీ అర్వింద్ రూ. 4 లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం బాల్కొండ మండల అధ్యక్షుడు అంబాటి నవీన్ మేరు సంఘ సభ్యులకు ప్రోసిడింగ్ కాపీని అందజేశారు. ఎన్నో ఏళ్ళుగా అసంపూర్తిగా కమిటి భవన్ నిర్మాణం ఉండడంతో ఎంపీ అర్వింద్‌ను నిధులు మజూరు చేయమని కోరిన వెంటనే మంజూరు చేసినందుకు ఎంపీ అర్వింద్‌కు బీజేపీ బాల్కొండ మండల నియోజకవర్గ ఇంచార్జి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి మేరు సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరు సంఘ సభ్యులు కోడిచర్ల రామకృష్ణ, డీకొండ రామకృష్ణ, డీకొండ రామకృష్ణ, రమేష్, దశరత్, ప్రసాద్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

దోన్‌పాల్‌లో షెడ్లకు భూమిపూజలు

మోర్తాడ్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి):మండలంలోని దోన్‌పాల్ గ్రామంలో శుక్రవారం పశువులకు, మేకలకు షెడ్ల నిర్మాణానికి ఎంపీడీవో తిరుమల భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. షెడ్ల నిర్మాణానికి బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్ నిధులు మంజూరు చేయించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో శకుంతల, ఏఎంసీ డైరెక్టర్ మహిపాల్, మాజీ సర్పంచ్ దేవన్న, ఆనంద్,లక్ష్మీ దుర్గ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొత్త మహిళ సంఘాలను ఏర్పాటు చేయాలి

ముప్కాల్,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి):గ్రామాలలో వృద్ధులు, వికలాంగులు, కిషోరా బాలికలతో కొత్త మహిళ సంఘాలను ఏర్పాటు చేయాలని డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ రాసయ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ మహిళ సాధికారత కేంద్రం నుండి పుష్ప, ఏపీఎం గంగారాం, మండల సమాఖ్య అధ్యక్షు రాలు బి.స్వరూప,మహిళసంఘాల సభ్యులు, సీసీలు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యదర్శిగా అనిల్

మోర్తాడ్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శిగా మోర్తాడ్‌కు చెందిన సంఘం అనిల్ కుమార్ శుక్రవారంనియమితులయ్యారు. మోర్తా డ్‌కు చెందిన సంఘం అనిల్‌కుమార్ గత 28 సంవత్సరాలుగా క్రియశిల పాత్ర పోషిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా , బీజేవైఎం జిల్లా కార్యదర్శిగా పదవులు నిర్వహించారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్

ముప్కాల్,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి):బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నిమ్మల శ్రీనివాస్ ను శుక్రవారం ఎన్నుకున్నారు. గతంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా ఉన్న నిమ్మల శ్రీనివాస్‌ను ప్రధాన కార్యదర్శిగా నియమిం చడం పట్ల ఆయన ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు బీజేపీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ఏలేటి మల్లికార్జున్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా బీజేపీ కార్యదర్శిగా నోముల నర్సారెడ్డి

వేల్పూర్, ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): జిల్లా బీజేపీ కార్యదర్శిగా వేల్పూర్ మండల కేంద్రానికి చెందిన నోముల నర్సారెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా తమను నియమించినందుకు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్, మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ, యువ నాయకులు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు దినేష్, నిజామాబాద్, బాల్కొండ నియోజకవర్గాల బీజేపీ నాయకులు కార్యకర్తలకు నర్సారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల తనిఖీ

ఆర్మూర్ , ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం మంథని గ్రామంలో శుక్రవారం మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, ఆరోగ్య సబ్‌సెంటర్లు తనిఖీ చేశారు. ఆయ న వెంట ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి భార్గవి ఉన్నారు.

ఆర్మూర్ ఫ్రైడే డ్రైడే

ఆర్మూర్ టౌన్ , ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు కాలనీలో యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రేయ,హెల్త్ అసిస్టెంట్ ఆనంద్, జగదీష్, రాజవ్వ, కమల, విజయ, శ్యామల, సౌందర్య, వనిత, పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

వేల్పూర్/మాక్లూర్ ,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె గ్రామంలో శుక్రవారం బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు.ఈ నిధులు మంజూరుకు కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌కుమార్, రాష్ట్ర విత్తనా భివృద్ధి చైర్మన్ అన్వేష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భగవన్‌దాస్, సురేస్, రాజేందర్, రాజేశ్వర్, మదన్, గంగారెడ్డి, పాల్గొన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదేశాను సారం శుక్రవారం మండలంలోని మానిక్ బండార్ గ్రామంలో సీఎంసహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, అర్జున్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక ప్రారంభం

రెంజల్,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో శుక్రవారం పశువుల పాకను ఎంపీడీవో కమలాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగభూషణం రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు సాయిరెడ్డి, ధనుంజయ్, సాయిబాబా గౌడ్, కుర్మె శ్రీను, అంజయ్య, ఏపీవో రమణ, తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలి

● సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్

ఆర్మూర్‌టౌన్ ,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ప్రజలు శాంతియుత వాతావరణంలో పండు గలు జరుపుకోవాలని సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం గణేష్ నిమజ్జనంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ సత్యనారాయణ, మున్సిపల్ కమీషనర్ రాజు, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, విద్యుత్ ఏడీఈ కృష్ణ, మార్కెట్ కమిటి చైర్మన్ సాయిబాబాగౌడ్, వైస్ చైర్మన్ ఇట్టెం జీవన్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మందుల బాలు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, వివిధ సంఘాల నాయకులు, యూత్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలో రాబోవు గణేష్ ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా దైవభక్తితో జరుపుకోవాలని ఎస్సై రాము కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో శాంతి కమిటి నిర్వహించారు. సమావేశంలో గణేష్ మండల సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

మాక్లూర్: ఈనెల 27న ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాలను ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బంది గా నిర్వహించాలని తహసీల్దార్ శేఖర్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో గణేష్ ఉత్సవాలపై సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో ఎస్సై రాజశేఖర్, ఎంపీడీవో బ్రహ్మానందం, విద్యుత్‌శాఖ ఏఈ నితిన్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని వినాయక మండలి ఉత్సవ కమిటీల సభ్యులు నిబంధనలను తూచాతప్పక పాటించాలని కమ్మర్‌పల్లి ఎస్ఐ అనీల్ రెడ్డి అన్నారు.ఈ సమావేశంలో తహసీల్దార్ జి ప్రసాద్,ఎంపీడీవో రాజా శ్రీనివాస్. మండలంలోని ఆయా గ్రామాల పోలీసు అధికారులు. ఏఈ ట్రాన్స్‌కో అన్నయ్య, మండల మెడికల్ అధికారి డాక్టర్ నర్సిహస్వామి, ఆయా గ్రామాల విడిసి సభ్యులు ఉత్సవ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

నందిగామలో టవర్ ఏర్పాటు చేయాలి

నవీపేట,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందిగామలో బీఎస్ఎన్ఎల్ టవర్‌ను ఏర్పాటు చేయాలని పలువురు మండల బీజేపీ నాయకులు శుక్రవారం జిల్లా కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ జాగారంకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టవర్ లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. నందిగామలో బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటామని జీఎం హామీ ఇచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాగభూషణ్, రమణరావు, రాజేందర్ గౌడ్, నీరడి భూషణ్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవీపేట, జన్నేపల్లి, కమలాపూర్, రాంపూర్‌లలోని 33/11 సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరపరాకు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్‌లలో మరమ్మత్తులలో భాగంగా నవీపేట, జన్నేపల్లి, కమలాపూర్ సబ్ స్టేషన్‌ల పరిధిలో మధ్యాహ్నం 3గంటల నుండి 6గంటల వరకు రాంపూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10గంటల నుండి మద్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరపరాలో అంతరాయం కలగనుందని ఈ విషయంలో వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బోధన్,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ పద్దతిలో భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించబడినయని సూపరిండెంట్ డాక్టర్ రాహుల్ తెలిపారు. గైనకాలజిస్టు విభాగంలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అనస్థీషియా ఒక పోస్టు ఖాళీగా ఉందని వీరికి నెలకు లక్ష రూపాయల వేతనం ఉంటుందని ఆయన తెలిపారు. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ ఒక పోస్టు ఖాళీగా ఉందన్నారు. వేతనం 52,351 రూపాయలు ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు కావాల్సిన సర్టిఫికేట్‌లను బోధన్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ కార్యాలయంలో లేదా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అందించాలన్నారు. ఈ నెల 26వ తేది లోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

ఆర్మూర్ , ఆగస్టు22(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం పిప్రి గ్రామంలో శుక్రవారం నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎంపీడీవో శివాజీ భూమిపూజ చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఏఈ నితిష్, పంచాయతీ కార్యదర్శి మురళికాంత్, మాజీ సర్పంచ్ జీవన్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యం

» రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



బీర్కూర్‌లో భూమిపూజ చేస్తున్న రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బీర్కూర్/బాన్సువాడ రూరల్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి):పల్లెల్లో మౌలిక వసతులను కల్పించడమే ప్రభుత్వలక్ష్యమనిరాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్‌కాసుల బాల్‌రాజ్ అన్నారు. అందుకే ప్రభుత్వం ఉపాధిపనుల జాతర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. శుక్రవారంరాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ బీర్కూర్ మండలంలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి పనుల జాతర కార్య క్రమాన్ని ప్రారంభించారు. బీర్కూర్‌లో అంగన్‌వాడీ భవననిర్మాణానికి, సంబాపూర్,మల్లాపూర్, బీర్కూర్‌తండాలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. పనుల జాతర కార్యక్రమం ద్వారా పల్లెల్లో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా, జల సంరక్షణ, వ్యవసాయ అభివృద్ధి,జీవన ప్రయాణాల పెరుగుదలకు ఈకార్యక్రమం ఉపయోగపడు తుందని అన్నారు.రాజకీయాలకు అతీతంగా ప్రజలు,ప్రజాప్రతినిధులు అందరూ ఈ కార్యక్ర మంలోభాగస్వామ్యం కావాలన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు శశికాంత్, యామరాములు, రఘు, శంకర్, కాంత్‌రెడ్డి,ఏజాజ్, గోపాల్ రెడ్డి, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

బాన్సువాడరూరల్:బాన్సువాడ మండలంలోని ఎస్సీ కాలనీలో సబ్‌ప్లాన్ నిధుల కింద మంజూరైనా రూ.70లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాకంగా చేపడుతున్న పనుల జాతర కార్యక్రమంలో బాగంగా శుక్రవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పోరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు శంకస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభు త్వం గ్రామాలలో మౌళి సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందన్నారు.సంక్షేమపథకాలను పార్టీలకు అతీతంగా పేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందజేస్తున్నామని, గ్రామాలను అభివృద్ధి చేసిన ప్పుడే రాష్ట్రం బాగుపడు తుందని, రాష్ట్రముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో గ్రామాలకు నిధులు ఇవ్వడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్‌ఈఈ అంజనేయులు, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, డీఎల్‌పీవో సత్యనారాయణ రెడ్డి, ప్రత్యేక అధికారి నాగేశ్వర్ రావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కాలేక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షలు మధుసూదన్‌రడ్డి, ఏఈ రాకేష్, ఇంచార్జి ఎంపీడీవో ముజాహిద్, ఏపీవో భిక్షపతి, పంచాయతీ కార్యదర్శులు సాయికుకమార్, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● ఇబ్రహీంపేట్‌లో పనుల జాతరను ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్...

బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల జాతర కార్యక్రమంలో బాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఇంకుడు గుంత కొరకు పనులను మార్కెట్ కమిటీ చైర్మన్ మంత్రి అంజవ్వ గణేష్, జిల్లా విద్యాశాఖ అధికారి రాజు శుక్రవారం ప్రారంభించారు.ఈసందర్భంగా వారు మాట్లాడు తూ ఉపాధి హమీ పథకంలో బాగంగా పశువులు, కొళ్లషెడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, ఉద్యానవన మొక్కల పెంపకం, నూతన వ్యవసాయ బావులతవ్వకం, తదితర పనులను చేపట్టడం జరుగుతుం దన్నారు. డీఎల్‌పీవో సత్యనారాయణ,అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నీటిని ఎందుకు నిల్వ చేయడం లేదు?

» నిజాంసాగర్ నీటి మట్టం 17.802 టీఎంసీల సామర్థ్యం » 14 టీఎంసీల నీటి నిల్వ » నీటిని వృథా చేస్తున్నరని రైతుల ఆరోపణ



మూడు టీఎంసీల నీటిని తక్కువ నీటిమట్టాన్ని విలువ చేస్తున్న దృశ్యం

నిజాంసాగర్,ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎగువ మంజీరా నది వెంట నిజాంసాగర్‌లోనికి వరద నీరు క్రమేపిన తగ్గుముఖం పట్టింది. శుక్రవారం నాటికి ఎగువ నుంచి 40 వేల 289 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోనికి వస్తూనే ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్లలోని 4 గేట్ల నెత్తి 16,574 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మంజీరాకు విడుదల చేస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో 17.802 టీఎంసీలకు గాను 1402.00అడుగుల నీటి సామర్థ్యాన్ని నిలువ చేస్తూ ఉన్నారు. ప్రస్తుతం అధి కారులు 17.802 టీఎంసీల నీటి సామర్థ్యానికి గాను 14.735 టీఎంసీలు నీటిని నిలువ చేస్తూ ఉన్నారు. ప్రాజెక్టు పూర్తి నుంచి సామర్థ్యాన్ని నిలువ చేయకుండా దిగువకు నీటిని వదలడం పట్ల సర్వత్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ప్రాజెక్టు పూర్తి నీటి మట్టడానికి 3.067టీఎంసీల నీరు విలువ చేయాల్సి ఉంది. కానీ అధికారులు ఎందుకు నిలువ చేయడం లేదు అని రైతులు ప్రశ్నిస్తున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టును తిలకించేందుకు గత ఐదు రోజులుగా సందర్శకులు వస్తూనే ఉన్నారు. ప్రధాన రహదారుల గుంట పోలీసులు సందర్శకులను కాలినడకన వెళ్లాలని వాహనాలను దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలోనే నిలిపివేయిస్తున్నారు. నిజాంసాగర్ పరిసరాల ప్రాంతాల్లో గార్డెన్లో కనీస సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు అనేక ఇక్కట్లు ఇక్కట్లు ఎదు ర్కొంటూ ఉన్నారు. నిజాంసాగర్ రాయగడ్ రైతులు ఈ వర్షాకాలంలో ముందస్తుగా వరి నాట్లు పూర్తి చేసి వర్షాల కోసం ఎదురు చూశారు. ఈనెల 18వ తేదీ నుంచి సింగూరు వరద గేట్లు ఎత్తి దిగువ మంజీరా నదిలోనికి నీటిని విడుదల చేశారు. అప్పటి నుండి రైతులు నిజాంసాగర్ నిండుతూ వస్తూ ఉండడంతో రైతుల ఆశలు చిగురుస్తూనే ఉన్నాయి. వారం రోజులుగా భారీ వర్షాలు కురియడంతో మంజీరా వెంటా భారీ వరద నీరు రావడంతో నిజాంసాగర్ నిండడమే కాకుండా దిగువ మంజీరాకు ఈనెల 18వ తారీఖు నుంచి నేటి వరకు 24.856 టీఎంసీల నీటిని ప్రాజెక్టు దిగువ మంజీరా లోనికి విడుదల చేసినట్లు అధికారులు వెల్లడించారు.

పాఠశాలల ఫీజుల దోపిడీ

» అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రైవేట్ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

జుక్కల్,ఆగస్టు22(ఆంధ్రజ్యోతి):జుక్కల్ మండల కేంద్రంలో ఓపాఠశాలలో బోర్డు ఏర్పాటు చేయకుండా విద్యార్థులను అడ్మిషన్లు తీసుకొని అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఆరోపణపై జుక్కల్ ఎంఈవో తిరుపతయ్య తనిఖీ నిర్వహించారు. శుక్రవారం రోజు అంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అనే వార్త కథనం ప్రచురించడంతో వెంటనే స్పందించిన ఎంఈవో పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలిం చా రు. ప్రవేట్ పాఠశాలకు బోర్డు ఏర్పాటు చేయకపోవడం ప్రత్యక్షంగా చూసి త్వరలోనే బోర్డు ఏర్పాటు చేయాలని యజమాని ఆదేశించినట్లు ఆయన అన్నారు. అదేవిదంగా టెస్టు నోట్ బుక్స్ స్కూల్ యూనిఫామ్స్, టై, బెల్టు విక్రయిం చవద్దని యజమానికి సూచించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకే తరగతి వారీగా ఫీజులు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన చర్యలుంటాయన్నారు.

పింఛన్ల కోసం అవస్థలు పడుతున్న వృద్ధులు





ఇంట్లోంచి రాలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు

మద్నూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పేదలకు అందజేస్తున్న పింఛన్లు వృద్ధులు, రోగాల బారిన పడి ఇంటికే పరిమితమైన వారు పింఛన్లు పొందలేక అవ స్థలు పడుతున్నారు.పెన్షనర్లకు తిప్పలు తప్పడం లేదు. బయోమెట్రిక్‌తో సమస్యలు తలెత్తుతుండడంతో ప్రభుత్వం ఐరిస్ విధానాన్ని ఆగస్టు నెల నుంచి అమలు చేస్తుంది. మండలంలోని దాదాపు ప్రతి గ్రామంలో ఐరిస్‌తో ముఖాలు ,కళ్ల స్కాన్ కాకపోవడంతో వృద్ధులు తీవ్రఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు.ఆసరాపెన్షనర్లకు ఫేస్ రికగ్నిషన్‌తో అంద జేసే విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.వేలిముద్రల ఆధారంగాపెన్షన్లు ఇస్తున్న విధానంలో లోపాలు ఉండటంతో ఆ సమస్య నుంచి బయట పడేందుకు నూతనవిధానం అమలులోకి తెచ్చింది. సులభంగా పింఛన్ అందజేసేలా ఫేస్ రికగ్నిషన్ ఈ యాప్ ద్వారా ఫో టోలు తీసి అప్లోడ్ చేసి లబ్ధిదారులకు డబ్బులు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ఇందులో సైతం పలువురికి ఐరిస్ రాకపోవడంతో మం డలంలోని ఆయాగ్రామాల్లో వారిని పక్కన పెడుతున్నా రు. ఆయా గ్రామాల్లో పెన్షన్ తీసుకునే వృద్ధుల్లో కొందరు రోగాల బారిన పడి ఇంటికే పరిమితమై పింఛన్లు పొంద లేకపోతున్నారు. వారికి గ్రామ పంచా యతీ కార్యదర్శి లేదా గ్రామ బీపీఎం ఇంటికి వెళ్లి పెన్షన్లు ఇవ్వాల్సి ఉం టుంది. కానీ అటువంటి వారి పట్ల అధికా రులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఇంటికే పరిమితమైన పింఛన్‌దారులకు పెన్షన్లు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని హండే కేలూర్ గ్రామం లో ఇంట్లో నుంచి లేచి బయ టకు రాని పరిస్థితి లో ఉన్న దేవు బాయ్,తో పాటు మతిస్థిమితం లేని వయసులో ఉన్న మరో వృద్ధు రాలికి అధికారుల నిర్లక్ష్యంతోఈ నెల ఇం టికి వెళ్లి పెన్షన్ ఇవ్వలేక పోయారు. ఇటువంటివారు ప్రతి గ్రామానికి 20 నుంచి 20 మంది వరకు ఉన్న ట్లు తెలు స్తుంది. సంబం ధిత అధికారులు స్పందించి ఇంటికి వచ్చి పెన్షన్‌ఇచ్చే విధంగా ఏర్పాటు చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

వామ్మో.. పెద్ద ప్రమాదమే తప్పింది





బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్ క్యాంటీన్‌లో పెచ్చులూడిన దృశ్యం

బాన్సువాడటౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వామ్మో .. బాన్సువాడ ఆర్టీసీ బస్టాండ్‌లో పెద్ద ప్రమాదమే తప్పినట్లైంది. బస్టాండ్‌లో ఉన్న క్యాంటీన్ పెకప్పు ఒక్కసారిగా కూలడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. పైకప్పు కూలిన సమయంలో అక్కడ ప్రయాణీకులు , సిబ్బంది ఎవరు కూడా లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. క్యాంటీన్‌లోని సామాగ్రి పూర్తిగా దెబ్బతింది. ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి శిథిలావస్థలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లకు మరమ్మతులు చేయించాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఘనంగా జానపద దినోత్సవం



ర్యాలీ నిర్వహిస్తున్న జానపద కళాకారులు

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జానపద కళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర జానపద కళాసంఘం ఆధ్వర్యంలో జానపద సంబురాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ నుంచి కళాకారులు పులాంగ్ చౌరస్తా వద్ద టీటీడీ కళ్యాణ మండపం వరకు ర్యాలీని జరిపారు. ర్యాలీ దారిపొడవున కళాకారుల కళా ప్రదర్శనతో దేశ సంస్కృతి ఆధారపడుతుందని నినాదాలు చేశారు. అనంతరం తిరుమల తిరుపతి కల్యాణ మండపంలో బుర్రకథ, శాస్త్రీయ నృత్యం, జానపద నృత్యం, ఒగ్గుకథ వంటి ప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జానపద కళా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ప్రదాన కార్యదర్శి చెంచు లింగయ్య ముఖ్యఅతిథులుగా హాజరై మాటాడుతూ తెలంగాణ ప్రభుత్వ భాషా సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో ప్రతియేటా ప్రపంచ జానపద కళా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని అన్నారు. దేశ, రాష్ట్ర సంస్కృతిక చిహ్నాలు జానపద కళలు అని అన్నారు. తె లంగాణ ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఎందరో కళా కారులు సేవలు అందించారని అన్నారు. కళాకారులు రాష్ట్ర అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర జానపద కళా సంఘం కార్యదర్శి రెడ్డి రాజయ్య, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు చౌకలింగం, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు విశ్వనాథం, కార్యదర్శి ఆనంద్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు, పాల్గొన్నారు.

దుర్గాదేవి ఆలయంలో సామూహిక కుంకుమార్చన

నిజామాబాద్ కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గుమస్తా కాలనీలో కొలువదీరిన దుర్గాదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకొని సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ఆర్చకులు మణికంఠ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులచే కుంకుమార్చన పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు విజయకృష్ణ, కోశాధికారి వేణుగోపాల్, సభ్యులు సదాశివ, హరీష్, సంతోష్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పొలాల అమావాస్య

» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు ఎడ్లను అలంకరించారు » పశువులను దేవుళ్లుగా కొలిచే ఏకైక పండుగ » ఎడ్ల నూతన వస్త్రధారణచేసి కొమ్ములకు రంగులద్దారు



ఎడ్లకు మారుతిమందిరం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



రుద్రూరులో ఎడ్లను ఊరేగింపు దృశ్యం



నందిపేటలో ఊరేగిస్తున్న రైతులు

బోధన్/రుద్రూరు/మద్నూర్/నవీపేట/నందిపేట/రెంజల్/కోటగిరి ,ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని చివరి రోజు అయినటువంటి శ్రావణ మాస అమావాస్య సందర్భంగా బోధన్ పట్టణంలోని మారుతిమందిరంలో ఆనవాయితీ ప్రకారంగా నందీశ్వర కల్యాణం పూజ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆలయ కమిటీ అర్చకులు ప్రవీణ్ మహరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎడ్ల పొలాల అమావాస్య సందర్భంగా గ్రామ దేశాయ్ అజయ్ వడియర్ స్వగృహం నుండి నందీశ్వరులు ఆలయానికి రావడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పాడిపంటలు సక్రమంగా పండాలని ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ వీడీసీ చైర్మన్ గంగాధర్ రావు పట్వారీ, మారుతి మందిరం చైర్మన్ గుండెటి శంకర్, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్‌చారి, దేవాదాయ శాఖ నిర్వహణ అధికారి రాములు, పట్టణవిద్యుత్ శాఖ ఏఈ నాయిని కృష్ణ, అంకు సంతోష్ రెడ్డి, అంకు దాము, రాజేంద్ర ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు బోదు శేఖర్, సుధాకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు. రుద్రూర్ మండల కేంద్రంతో పాటు అంబం(ఆర్) గ్రామంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎడ్ల పొలాల అమావాస్యను ఘనంగా జరుపుకున్నారు. గ్రామ శివారులో ఎడ్లను ముస్తాబు చేసి హనుమాన్ మందిరం చుట్టూ ఎడ్లను ఊరేగింపు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఇందూరి చంద్రశేఖర్, బచ్చు రాము, పత్తి రాము, అంబం(ఆర్)లో గ్రామ కమిటీ అధ్యక్షుడు రేంజర్ల గంగారాం, కార్యదర్శి రాము, ఎస్‌ఐ సాయన్న, గ్రామస్థులు నాగనాథ్, మహిళలు, శానం సాయిలు(టీచర్), పూర్ణయ్య, బడే రాము, పున్న శ్రీనివాస్, యువకులు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో రైతులు పొలాల అమావాస్య పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణమాసం చివరి అమావాస్య రోజున ఈ పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. ఆ మేరకు శుక్రవారం తెల్లవారు జాము నుంచే రైతుల ఇంటి వద్ద సందడి కనిపించింది. రైతులు తమ వద్ద ఉన్న పశువులకు అమావాస్య రోజున వ్యవసాయ పనులు చేయించ కుండా వాటిని శుభ్రంగా స్నానం చేయిం చి పూజలు చేశారు. పశువుల పండుగను పురస్కరించుకొని పట్టిక బెల్లం పాయా సంగా తాగించారు. సంవత్సరానికి ఒకసారి బసవన్న లను జోళ్ళ(బాసింగాలు), గంటలు, గజ్జలు, రంగురంగుల దుస్తులతో అలంకరిం చారు. సాయంత్రం మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణానికి తీసుకు వచ్చి ప్రదక్షిణలు చేయించారు. వాటిని తమ ఇంటికి తీసుకెళ్లి ఆవు ఎద్దుతో కలిపి వేదబ్రాహ్మణుల చేత వివాహం జరిపించారు. చుట్టు పక్కల వారితో పాటుతమబంధు మిత్రులతో కలిసి భోజనాలు చేశారు. మట్టి బసవన్నలకు పూజలు,రానురాను యాంత్రికరణ పెరిగిపోవడంతో రైతులు ఎద్దులను కాకుండా యంత్రాలతో వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు.దీంతోగ్రామాల్లో ఎద్దుల సంఖ్య రోజు రోజుకు తగ్గిపోవడంతో పొలాల అమావాస్య రోజు ఆన వాయితీగా మట్టిఎద్దులను తయారు చేసి పూజలు నిర్వహిస్తున్నారు.నవీపేటమండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఎద్దులను అందంగా అలంకరించి స్థానిక హనుమాన్ ఆలయాల చుట్టు ప్రదక్షిణ చేయించారు.గతంలో నవీపేటలో వందలాది ఎద్దుల జతలు అందుబాటులో ఉండగా గత కొన్ని సంవత్సరాలుగా ఎద్దుల సంఖ్యపూర్తిగా తగ్గిపోయింది.దీంతో కొన్ని ఏళ్లుగా మట్టితో తయారు చేసిన ఎద్దులను గ్రామంలో ఆనవాయితీగా ఊరేగిస్తున్నారు. నవీపేటలో జరిగిన కార్యక్రమంలో పెద్దలు, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు. నందిపేట మండలంలో శుక్రవారం ఎడ్ల పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో ఎడ్లు ఉన్న రైతులు వాటిని శుభ్రం చేసి, కొమ్ములకు రంగులు అద్ది నూతన వస్త్రాధారణ చేశారు. మరి కొన్ని గ్రామాల్లో ఎడ్లు లేని రైతులు మట్టితో తయారు చేశారు.అంతే కాకుండా ట్రాక్టర్లను శుభ్రం చేసి బ్యానర్లు, బుగ్గలుకట్టారు. డప్పులతో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు.అనంతరం నందిపేట మండల కేంద్రంలోని నందికేశ్వర ఆలయానికి తీసుకొచ్చి పూజలు చేయించారు. అనంతరం ఇంటికి తీసుకు వెళ్లి నైవేద్యాలు సమర్పించి, తీపి వంటలు ఆరగించారు. ముందుగా రైతులు ర్యాలీలో కోలాటం, కర్ర తిప్పడం చేశారు. రెంజల్ మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. పశువులను దేవుళ్లను పూజిస్తూ వాటిని అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పశువులను దేవుళ్లగా కొలిచే ఏకైక పండుగ పొలాల అమావాస్య అని పశువులను అందంగా అలంకరించి వాటికి ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోని ఆలయం వద్దకు తీసుకెళ్లి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయిస్తారు. పాడిపంట ప్రజలందరు సుఖశాంతులతో ఉండాలని పొలాల అమావాస్య రోజున పశువులను దేవుళ్లగా భావించి పండుగ నిర్వహిస్తారు. ఉవాసం ఉండి పశువులకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లిస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. కోటగిరి, పొతంగల్ మండలాల్లో శుక్రవారం ఎడ్ల పొలాల అమావాస్యను రైతులు ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసం ముగింపు సందర్భంగా వచ్చే అమావాస్య సందర్భంగా ఎడ్లపొలాల పండుగను నిర్వహించడం ఆనవాయితీ. రైతులు ఉదయాన్నే తమ ఎద్దులను శుభ్రం చేసి కొమ్ములకు రంగులు అది, మెడలో గజ్జెలు, పసుపు, కుంకుమ, పూల దండలతో అలంకరించారు. కోటగిరి, పొతంగల్, ఎత్తొండ, యాద్గార్‌పూర్, సుంకిని, కల్లూర్ గ్రామాలలో సాయంత్రం ఆంజనేయ స్వామి ఆలయాల చుట్టు ఎద్దులతో ప్రదక్షిణలు చేయించారు.గ్రామాలలో గతంలో ఉన్నంత సందడి లేకుండా పోయింది. గ్రామాలలో పొలాల అమావాస్య ఆనవాయితీని కొనసాగించారు.



రెంజల్‌లో..



నాళేశ్వర్‌లో ఎడ్లను ఊరేగిస్తున్న రైతులు



ఆలయం చుట్టూ బసవన్నల ప్రదక్షిణలు



కోటగిరిలో..



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న దృశ్యం

యూరియా కొరత తీర్చాలని షబ్బీర్‌అలీకి వినతి

దోమకొండ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):మండలంలో రైతులకు యూరియా కొరత తీర్చాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి శుక్రవారం దోమకొండ విండో పాలకవర్గం సభ్యులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ రెండు రోజుల్లో యూరియా కొరత తీరుస్తానని హామీ ఇచ్చినట్లు విండో పాలకవర్గం సభ్యులు తెలిపారు. అనంతరం షబ్బీర్‌అలీని వారు శాలువతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో విండో పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న దృశ్యం

ఆకు ముడత పురుగును సకాలంలో గుర్తించాలి

బాన్సువాడ రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని పోచారం గ్రామంలో వరి పంట పొలాలను ఏఈవో దత్తేశ్వరీ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వరిలో వచ్చే ఆకుముడత పురుగును గమనించి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ, 400 గ్రాముల మందును ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని, వాడినట్లైతే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి

విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు

● మండల ప్రత్యేక అధికారి దయానంద్

నసురుల్లాబాద్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి దయానంద్ అన్నారు. శుక్రవారం నసుల్లాబాద్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారి వెంట ఎంపీడీవో రవిశ్వర్ గౌడ్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మాధవరావ్, వైస్ ప్రిన్సిపాల్ రాహుల్, డిప్యూటీ వార్డెన్ రాధా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.



మొక్కలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ వార్డు ఆఫీసర్ జ్యోతి

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలి

ఎల్లారెడ్డి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని మున్సిపల్ వార్డు అధికారిని జ్యోతి అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మున్సిపాలిటీలోని ఐదవ వార్డు గండిమాసానిపెట్‌లో వన మహోత్సవంలో భాగంగా ఇంటికి ఆరు మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పెరటి పరిసరాల్లో మొక్కలు నాటి రక్షించాలని, మొక్కలు పెంచడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో పార్థ సింహారెడ్డి

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి

● ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహారెడ్డి

ఎల్లారెడ్డి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉత్సవాలను గణేష్ శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఆర్డీవో పార్థ సింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో గణేష్ ఉత్సవాలపై పలు ప్రభుత్వ శాఖలు, పొలిటికల్ పార్టీలు, మత పెద్దల ప్రతినిధులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై హిందూ, ముస్లిం ప్రతినిధుల అభిప్రాయాలు, సూచనలు ఆర్డీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు సామాజిక సమైక్యతకు ప్రతీకగా నిలవాలని, ప్రతి ఒక్కరు స్నేహపూర్వకంగా జరుపుకోవాలని కోరారు. ప్రజల ఆచార సంప్రదాయాలకు భంగం కలగకుండా ఉత్సవాలు జరగాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్ రావు, సీఐ రాజరెడ్డి, తహసీల్దార్ ప్రేమ్ కుమార్, ఎస్సై బొజ్జ మహేష్, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, ఫైర్ అధికారి వినోద్, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలో రక్తదాన శిబిరం

కామారెడ్డి టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకుడు మహ్మద్ ఇలియాస్ జన్మదినం సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 105 మంది రక్తదానం చేశారని పార్టీ నాయకులు తెలిపారు. అదేవిధంగా కామారెడ్డి, మాచారెడ్డి, దోమకొండ, బీబీపేట, భిక్కనూరులో పేద ప్రజలకు అన్నదానం, పండ్లు, పాలు పంపిణీ చేశామని నాయకులు తెలిపారు. కామారెడ్డి గ్రంథాలయంలో పాఠకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, గ్రంథాలయ చైర్మన్ మద్దిచంద్రకాంత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు పండ్ల రాజు, ఐరేనీ సందీప్ పాల్గొన్నారు.



కండేబల్లూర్‌లో అంగన్‌వాడీ భవనానికి పూజ నిర్వహిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



బ్రహ్మజివాడిలో షెడ్డును ప్రారంభిస్తున్న ప్రత్యేక అధికారి శివకుమార్

ఘనంగా ఉపాధి పనుల జాతర

తాడ్వాయి/గాంధారి/ఎల్లారెడ్డి రూరల్/మద్నూర్/నసురుల్లాబాద్/పెద్ద కొడప్‌గల్/ జుక్కల్/బాన్సువాడ టౌన్/ నిజాంసాగర్/ లింగంపేట/ పిట్లం/భిక్కనూరు/దోమకొండ/పాల్వంచ/ ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల జాతరను మండలంలో ప్రతీ గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు మండల ప్రత్యేక అధికారి శివకుమార్ తెలిపారు. మండల కేంద్రంతో పాటు 18 గ్రామ పంచాయతీలో పనులు ప్రారంభం, నూతన పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బ్రహ్మజివాడి, తాడ్వాయి, కన్కల్ గ్రామాల్లో పశువుల పాకల ప్రారంభం, ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాజిద్ అలీ, ఎంపీవో సవితారెడ్డి, ఏపీవో కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. గాంధారిలో ఉపాధిహామీ పనులను తహసీల్దార్ రేణుచౌహాన్ కూలీలతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ సంజీవ్, సర్దార్ నాయక్, లైన్ రమేష్, తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలో పనులను ఎంపీడీవో ప్రకాష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సురేందర్, ఏపీవో వినోద్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు. మద్నూర్‌లో వివిధ రకాల పనులను మండల ప్రత్యేక అధికారి రామ్మోహన్ ప్రారంభించారు. కార్యక్రమంలో డోంగ్లి మండల ప్రత్యేక అధికారి అమీనాబి, ఎంపీడీవో రాణి, పంచాయతీ అధికారి వెంకట నర్సయ్య, ఆయా గ్రామాల్లో కార్యదర్శులు, ప్రజలు పాల్గొన్నారు. నసురుల్లాబాద్‌లో ఆయా గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దయానంద్, ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, ఎంపీఓ సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద కొడప్‌గల్‌లో వివిధ రకాల పనులను ప్రారంభించారు. జుక్కల్ మండలం కండె బల్లూరు గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ నిర్మాణానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు రమేష్ దేశాయ్, మాజీ జడ్పీటీసీ సాయాగౌడ్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. నిజాంసాగర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు. ఇంకుడు గుంతలకు గేదెల షెడ్లకు భూమి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు మనోజ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ మండల ప్రత్యేక అధికారి ప్రమీల, ఏపీవో శివకుమార్, గ్రామ ప్రజలు తదితరులున్నారు. లింగంపేటలో ఉపాధిహామీ పనుల జాతరను ఎంపీడీవో నరేష్, ఎంపీవో ప్రారంభించారు.కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉపాధి సిబ్బంది ఉన్నారు. రాజంపేటలో పనుల జాతర కార్యక్రమాన్ని ఎంపీడీవో బాలకృష్ణ నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్‌లు అపర్ణ, ఎంపీవో రఘురాం, ఏపీవో శృతి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. పిట్లంలో పాత పంచాయితీ భవనం ముందు అంగన్‌వాడీ భవనానికి ప్రత్యేక అధికారి, నాయకులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు హన్మండ్లు, ఏఎంసీ వైస్ చైర్మెన్ క్రిష్టారెడ్డి, విండో చైర్మెన్ శపథంరెడ్డి, నాయకులు మొహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరులో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి, డీఎల్‌పీవో శ్రీనివాస్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, విండో చైర్మన్ భూమయ్య, ఏపీవో రాధిక, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భీంరెడ్డి, ఈవో మహేష్‌గౌడ్, నాయకులు, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు. దోమకొండ మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో పనుల జాతర కార్యక్రమంలో బాగంగా అధికారులు పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు. పాల్వంచలోని వాడి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



భిక్కనూరులో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం



మద్నూర్‌లో..

కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలి



తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్/రాజంపేట/తాడ్వాయి/సదాశివనగర్/దోమకొండ/లింగంపేట/బాన్సువాడ టౌన్/నసురుల్లాబాద్/పాల్వంచ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం కామారెడ్డి తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి ఇప్పుడు మీన మేషాలు లెక్కిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ విపుల్‌జైన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నందివేణు, పట్టణ ప్రధాన కార్యదర్శి రాజగోపాల్, రఘు, పట్టణ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. రాజంపేటలో తహసీల్దార్ జానకికి బీజేపీ నాయకులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సంపత్‌రెడ్డి, బీజేపీ గ్రామ అధ్యక్షుడు సాయిరెడ్డి, రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు. తాడ్వాయి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రతీ ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మండల బీజేపీ అధ్యక్షుడు వెల్మ సంతోష్‌రెడ్డి తహసీల్దార్ శ్వేతకు వినతిపత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు, ఎల్లారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ లింగారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు హోటల్ శ్రీను తదితరులు ఉన్నారు. సదాశివనగర్‌లో తహసీల్దార్ సత్యనారాయణకు బీజేపీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు రాంరెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అమృత భూంరావు, చక్రధర్‌గౌడ్, హరిక గోపాల్, మోహన్ రాజ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. దోమకొండలో బీజేపీ మండలశాఖ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మద్దూరి భూపాల్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కంది మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ పాల్వంచ మండల అధ్యక్షుడు అనీల్ తహసీల్దార్ హిమబిందుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సకాలంలో జరగక గ్రామాల్లో అభివృద్ధి కుంటు పడిందని వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు. లింగంపేటలో సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు క్రాంతి, ప్రధాన కార్యదర్శి విష్ణువర్దన్, బాలయ్య, మల్లయ్య ఉన్నారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కరించాలంటూ శుక్రవారం బీజేపీ నాయకులు మున్సిపల్ కమీషనర్ శ్రీహరిరాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పట్టణాధ్యక్షుడు కోనాల గంగారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పైడిమల్ లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, నాయకులు ప్రసాద్, చిదుర సాయిలు, తదితరులున్నారు. నసురుల్లాబాద్ మండలంలో ఆలయాల భూములు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు హన్మాండ్లు యాదవ్ తహసీల్దార్ సువర్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వడ్ల సతీష్, శేఖర్, గంగాధర్, పవన్, రాజు, లక్ష్మణ్ పార్టీ నాయకులు ఉన్నారు.



నస్రుల్లాబాద్‌లో..



బాన్సువాడలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం



లింగంపేటలో..

ఆలయ నిర్మాణానికి
దాతలు ముందుకు రావాలి

మద్నూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద గల పురాతన కాలం నాటి ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆలయ కమిటీ సమావేశంలో తీర్మానం చేసి పురాతన కాలం నాటి ఆలయ నిర్మాణంలో మీ వంతుగా సహాయ సహకారాలు అందించాలని కమిటీ అధ్యక్షులు సాయిలు కోరారు. ఈపాటికి ఆలయ నిర్మాణం పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు. పాత బస్టాండ్ వద్ద గల ఆంజనేయస్వామి ఆలయానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ఆలయ ప్రాంగణం నుంచి గ్రామంలోకి వెళ్లాల్సి ఉంటుంది, ఏ శుభకార్యము జరిగిన ఈ ఆలయం వద్ద ముందుగా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. పొలాల అమావాస్య రోజు ఈ ఆలయం వద్ద బసవన్నలకు పూజలు నిర్వహించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయిస్తారు. ఇంత ప్రాముఖ్యత గల ఆలయ పునర్నిర్మాణంలో మీ వంతు సహాయ సహకారాలు ఆర్థిక రూపంలో కాకుండా వస్తు రూపంలో నైనా అందించ వచ్చని కమిటీ సభ్యులు కోరారు.

పత్తిలో పచ్చదోమ, రసం పీల్చే పురుగులను నివారించాలి



బ్రాహ్మణపల్లిలో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో నర్సింలు

తాడ్వాయి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటలో పచ్చ దోమ, రసం పీల్చే పురుగులను నివారించుకోవాలని తాడ్వాయి ఏవో నరసింహులు తెలిపారు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి, దేవాయిపల్లి గ్రామాల్లో ఆయన శుక్రవారం పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో కాయలు రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు ఏసిటమిప్రిడ్ 0.2 గ్రాముల లీటర్ నీటిలో కలుపుకొని పిచికారి చేసుకోవాలని సూచించారు. రైతులు పంటలు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- వార్-2
ప్రియ 35- మహావతర్ నరసింహ
దర్శన్- పరదా, బన్ బటర్ జామ్

బాన్సువాడ

మహేశ్వరి వార్ 2
వెంకటేశ్వర కూలీ

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.220	రూ.230
విత్‌స్కిన్	రూ.270	రూ.280
స్కిన్‌లెస్	రూ. 290	రూ.300

విజృంభిస్తున్న విష జ్వరాలు

(5వ పేజీ తరువాయి)

వద్దకు బాధితులు చికిత్స కోసం క్యూ కడుతున్నారు. ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. పిల్లల వైద్యులు, జనరల్ మెడిసిన్, స్త్రీ వైద్య నిపుణులు వద్దకు అధికంగా వెళ్తున్నా రు. రోజుల తరబడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ, మలేరియా పేరుతో చికిత్స అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మాత్రమే టెలిసా పరీక్షలు చేసి డెంగీగా నిర్ధారణ చేయాలి కానీ రక్తకణాలు తగ్గుతున్నాయి అంటూ కొన్నిచోట్ల డెంగీ పేరుతో పెద్ద మొత్తంలో బిల్లులు వసూలు చేస్తున్నారు. డెంగీ, మలేరియా లాంటి విష జ్వరాల బూచి చూపి రోగుల నుంచి పలు ఆసుపత్రుల నిర్వాహకులు పెద్ద మొత్తంలోని దోపిడీకి పాల్పడుతున్నట్లు ఆరోపనలు వస్తున్నాయి.

అప్రమత్తమవుతున్న వైద్యారోగ్య శాఖ

వానాకాలం సీజన్ మొదట్లో వైద్య ఆరోగ్యశాఖ ఇంటింటి సర్వే నిర్వహించింది తీవ్రత ఉన్నచోట్ల మెడికల్ క్యాంపులు నిర్వహించారు. మరోసారి విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో జిల్లాలో కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ హెల్త్‌క్యాంపులు, ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు. దీంతో వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి జరసర్వే చేస్తున్నారు. రోగ లక్షణాలు ఉన్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేసే వీలు ఉంటుంది.

పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత

దోమలు, ఈగలు, కీటకాల వ్యాప్తితో పాటు తాగునీరు శుభ్రంగా లేక పరిసరాల అపరిశుభ్రత వైరస్ వ్యాప్తితో రోగాలు చుట్టుముడుతున్నాయి అని వైద్యులు చెబుతున్నారు. వానాకాలంలో తాగే నీరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. కాచి వడపోసిన నీరు, వేడి ఆహార పదార్థాలు, పోషకాలు రోగ నిరోధక శక్తి పెంచుకొని పండ్లు, కూరగాయలు తదితర వాటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. పరిసరాల్లో అపరిశుభ్రంగా లేకుండా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

కనెక్షన్ కట్.. సిగ్నల్ డౌన్!

(5వ పేజీ తరువాయి)

నిలిచిపోతున్నాయని కేబుల్ ఆపరేటర్లు మండిపడుతున్నారు. విద్యుత్ శాఖ కార్యాలయానికి వెళ్లి అధికారులను ఆపరేటర్లు ప్రశ్నిస్తున్నారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగిస్తుండగా ఆపరేటర్లు అడ్డుపడుతున్నారు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు పోలీసుశాఖ సహకారంతో వైర్లను తొలగింపు కార్యక్రమం కొనసాగిస్తున్నారు. జిల్లాలో 8 వరకు లోకల్ కేబుల్ టీవీ కనెక్షన్ ఉండగా, బ్రాండ్ బ్యాండ్ ఫైబర్ నెట్ 10 వరకు ఉన్నట్లు సమాచారం.

నిలిచిపోతున్న ఇంటర్నెట్ సేవలు, టీవీ ప్రసారాలు

జిల్లాలోని విద్యుత్ స్తంభాలకు ప్రమాదకరంగా ఉన్న ఇంటర్నెట్ వైర్లను కేబుల్ కనెక్షన్లను సంబంధిత శాఖ అధికారులు తొలగిస్తున్నారు. అయితే ఒక్కసారిగా వైర్లను తొలగించడంతో ఆయా ప్రాంతాల్లో టీవీ ప్రసారాలు బందవ్వగా, ఇంటర్నెట్ సేవలు నిలిచిపోతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కామారెడ్డి, ఎల్లారెడి, బాన్సువాడ పట్టణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలకు అంతరాయం కలుగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇంటర్నెట్ లేకపోవడంతో చాలా మంది ఆందోళన చెందుతున్నారు. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో పలు ప్రైవేట్ కంపెనీలో, బ్యాంకుల్లో, విద్యాసంస్థల్లో సేవలకు అంతరాయం ఏర్పడుతోంది.

అనుమతులు తప్పనిసరి

విద్యుత్ స్తంభాలకు ప్రైవేటు నెట్వర్క్ కేబుల్స్ వైర్లు వేయాలంటే విద్యుత్ శాఖ అనుమతి తప్పనిసరి. ఆయా శాఖకు దరఖాస్తు పెట్టుకుని అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్క కేబుల్ నెట్వర్క్ కంపెనీలు అనుమతులు తీసుకోవటం లేదు. విద్యుత్ స్తంభాలకు కేబుల్స్ వైర్లు వేయాలంటే భద్రత నిబంధనల వార్షిక ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. భద్రత నిబంధనల ప్రకారం విద్యుత్ లైన్‌లకు కాంటాక్ట్ కాకుండా సేఫ్గా కేబుల్ వేసుకోవాలి. ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన కేబుల్ వైర్లు మాత్రమే వాడాలి. ఎప్పటికప్పుడు ఇనెక్షన్ చేయాలి. అనుమతి లేకుండా కేబుల్ వేస్తే చట్ట విరుద్ధం. అనధికారికంగా వేసే కేబుల్ కంపెనీలపై జరిమానాలు విధించడమే కాకుండా క్రిమినల్ కేసులు కూడా పెట్టే అవకాశం ఉంటుంది.

విద్యుత్ స్తంభాలకు ఉన్న కేబుళ్లను తొలగిస్తున్నాం

● శ్రావణ్ కుమార్, జిల్లా విద్యుత్ శాఖ అధికారి, కామారెడ్డి

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని విద్యుత్ శాఖ స్తంభాలకు అనుమతి లేకుండా వేసిన ప్రైవేట్ కేబుళ్లను తొలగిస్తున్నాం. అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలకు వేసిన కేబుళ్లను తొలగించాలని ఆయా కంపెనీలకు ఇది వరకే నోటీసులు ఇచ్చాం. అయినా వారు స్పందించలేదు. దీంతో శాఖ సిబ్బంది కేబుళ్లను తొలగించాల్సి వస్తోంది.

ఉపాధి హామీ పనుల జాతరను..

(5వ పేజీ తరువాయి)

పూర్తి చేయాలని, ప్రభుత్వం ఖరీఫ్ 2024-25 నకు సంబంధించి 12 సెప్టెంబరు 2025 వరకు గడువు ఇచ్చిందని పెండింగ్ సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలని అన్నారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా మిల్లింగ్ జరగాలని, నిర్ణీత సమయానికి డెలివరీ పూర్తి చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. డెలివరీ చేయని మిల్లులపై చర్యలు తీసుకుంటామన్నారు. 100 సీఎంఆర్ పూర్తి చేసేలా అధికారులు ప్రణాళిక తయారు చేయాలని గడువులోగా సీఎంఆర్ అందించాలని తెలిపారు. బ్యాంక్ గ్యారెంటీలు వారం లోగా జిల్లా కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.విక్టర్, డీసీఎస్‌వో మల్లిఖార్జున బాబు, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, లీడ్ బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, జిల్లా రైస్‌మిల్లర్ కార్యవర్గం, జిల్లాలోని బాయిల్డ్ రా రైస్ మిల్లుల యజమానులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

కాంగ్రెస్‌లో చేరిన మెంగారం గ్రామస్థులు

లింగంపేట, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు రిటైర్డ్ ఎస్టీవో మాకం రాములు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై చేరుతున్నట్లు వారు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో యూత్ సభ్యుడు మనోజ్, కమ్మరి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మార్గం రాజు, బాబు, భాను, సాయిలు, మహేందర్, నవీన్, రవిలతో పాటు నాయకులు గ్రామస్థులు ఉన్నారు.

విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా బోధించాలి



చించోల్లి పాఠశాలలో విద్యార్థులతో చదివిస్తున్న ఎంఈవో వెంకన్న

బీర్కూర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యం ఆధారంగా వారికి విద్యా బోధన చేయాలని ఎంఈవో వెంకన్న ఉపా ధ్యాయులకు సూచించారు. శుక్రవారం ఎంఈవో వెంకన్న చించొల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలా బోధిస్తున్నారు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే విషయాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. విద్యార్థుల లర్నింగ్ అవుట్ కామ్స్‌ను పరిశీలించారు. మెనూ ప్రకారం వంట చేసి విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న ఏజెన్సీ వారికి సూచించారు. గ్రంథాలయ తరగతులు నిర్వహించాలన్నారు.